సాక్షి కామారెడ్డి

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



తరుగు తీస్తే కేసులు

తరుగు పేరిట రైతులను మోసం చేయాలని చూస్తే చర్యలు తప్పవని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హెచ్చరించారు.

- 8లో ▸



మూగ జీవాలకు అందని వైద్యం

జిల్లాలో పశువైద్యాధికారులు, సిబ్బంది కొరత కారణంగా మూగ జీవాలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



కామారెడ్డి టౌన్ : సైన్స్‌లో పరిజ్ఞానం పెంచుకుని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని డీఈవో రాజు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్నాలజీని వినియోగించుకుని సైన్స్‌లో నూతన అవిష్కరణలు చేసి విజయాలను సొంతం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. 'కృత్రిమ మేధస్సు ఉపయోగాలు, అనర్థాలు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో జిల్లాలోని 34 పాఠశాలలు పాల్గొన్నాయని తెలిపారు. మొదటి బహుమతి సాధించిన కామారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ పాఠశాల విద్యార్థిని ఎస్‌కే.సనాను ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి, ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, సదాశివుడు, ఉపాధ్యాయులు కృష్ణాకర్ పాల్గొన్నారు.

23న మెగా జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్ : స్వదేశీ జాగరణ్ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయమై స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ వి.రాహుల్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో 23న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. సుమారు వంద కంపెనీలలో పది వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఏదేని డిగ్రీ, పీజీ, ఫార్మా చదివినవారు మేళాలో పాల్గొనాలని, ఇతర వివరాలకు 81212 12873, 73373 73575 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో శనివారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 బాలబాలికల విభాగాలలో నిర్వహించిన పోటీలలో సత్తా చాటిన 48 మందిని ఆయా విభాగాలలో జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరు ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, స్వామిగౌడ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

నిజామాబాద్ నాగారం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఐఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో బాలబాలికలకు ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నాగారంలోని రాజారాం స్టేడియంలో ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు పీడీ ప్రసాద్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

చేప పిల్లల పంపిణీని వేగంగా పూర్తి చేయాలి



కామారెడ్డి టౌన్ : జిల్లాలో చేప పిల్లల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీపతి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా మత్స్య సహకార సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ సహకార సంఘాల్లో నూతన సభ్యత్వాలను ప్రారంభించాలన్నారు. వచ్చే నెల ఆరో తేదీన జిల్లా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల అభిప్రాయాల మేరకు అవసరమైన తీర్మానాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు గాదం సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్లు సాయిలు, దత్తు, లింబాద్రి, సాయిలు, నర్సింలు, లత, రమేష్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లాఠీ వదిలి.. చాక్‌పీస్ చేతపట్టి..





ఉపాధ్యాయురాలిగా ఎంపికైన మౌనికను అభినందిస్తున్న ఎస్పీ సింధు శర్మ

ఇన్నాళ్లూ లాఠీలు పట్టిన చేతులు.. ఇప్పుడు చాక్‌పీస్ చేతపట్టాయి. వారు శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడే పోలీస్ శాఖనుంచి.. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టారు. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహించిన ఎనిమిది మంది కానిస్టేబుళ్లు డీఎస్సీలో సత్తా చాటి ఉపాధ్యాయ కొలువు సాధించారు. వారి విజయాలపై ఈ వారం 'సాక్షి' సండే స్పెషల్..

టీచర్ కొలువులు సాధించిన పోలీసులు
ఎనిమిది మంది ఎంపిక

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఉన్నత చదువులు చదివిన చాలామంది డీఎస్సీ నోటిఫికేషన్లు రాకపోవడంతో ఇతర ఉద్యోగాలు వైపు మళ్లారు. అలా కొందరు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నా.. పుస్తకాలను వీడలేదు. కొలువు చేస్తూనే డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ-2024 లో సత్తా చాటి కొలువులు సాధించారు. జిల్లాకు చెందిన ఎనిమిది మంది కానిస్టేబుళ్లు టీచర్లుగా ఎంపికయ్యారు. తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించామని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టీచర్ ఉద్యోగం ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దుతామంటున్నారు. టీచర్లుగా ఎంపికైన కానిస్టేబుళ్లను ఎస్పీ సింధు శర్మ అభినందించారు. క్రమశిక్షణతో పనిచేసి మంచి టీచర్లుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు.

లక్ష్యాన్ని చేరుకున్నా..



మొదటి నుంచి టీచర్ కావాలన్న లక్ష్యంతో చదివాను. డీఎస్సీ కోసం ఎన్నో ఏళ్లు ఎదురు చూశాను. నోటిఫికేషన్ రాకపోవడంతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యాను. కానిస్టేబుల్‌గా ఎంపికై, కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించాను. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో కష్టపడి చదివి ఎస్జీటీ ఉద్యోగం సాధించాను. శాబ్దిపూర్ తండా స్కూల్‌లో పోస్టింగ్ వచ్చింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించినందుకు సంతోషంగా ఉంది.

– మౌనిక, ఎస్జీటీ, శాబ్దిపూర్ తండా స్కూల్

ఆనందంగా ఉంది



టీచర్ కొలువు సాధించాలన్న తపనతో కష్టపడి చదివాను. కానీ ఎంతకీ డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడంతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి అప్లై చేశాను. పరీక్ష రాసి కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యాను. మా చారెడ్డి పోలీస్ స్టేషన్‌లో పనిచేశాను. ఉద్యోగం వచ్చిన నాలుగేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. కష్టపడి చదివి టీచర్‌గా ఎంపికయ్యాను. జుక్కల్ మండలం కౌలాస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది.

– సౌజన్య, ఎస్జీటీ, కౌలాస్ స్కూల్

కల నెరవేరింది



టీచర్ కావాలన్నది నా కల. డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యమవుతుండడంతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నా. పరీక్ష రాసి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. మొన్నటి వరకు గాంధారి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాను. డీఎస్సీ-2024 నోటిఫికేషన్ రావడంతో దానికి ప్రిపేర్ అయ్యాను. ఎస్జీటీగా ఎంపికయ్యాను. మాచారెడ్డి మండలంలోని రత్నగిరిపల్లిలో టీచర్‌గా జాయిన్ అయ్యాను.

– నవీన్, ఎస్జీటీ, రత్నగిరిపల్లి స్కూల్

టీచర్ కొలువు సాధించా



బీఈడీ పూర్తి చేసిన తర్వాత టీచర్ కావడం కోసం కష్టపడ్డా. నోటిఫికేషన్లు లేకపోవడంతో పోలీస్ ఉద్యోగం కోసం ప్రయత్నించి కానిస్టేబుల్ అయ్యాను. ఇన్నాళ్లూ బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాను. ఇటీవల డీఎస్సీ-2024 రాసి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాను. అంజనీ తండాలో టీచర్‌గా జాయిన్ అయ్యాను. టీచర్ కావాలనుకున్న నా లక్ష్యం నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

– వసీం, స్కూల్ అసిస్టెంట్, అంజనితండా స్కూల్

సంతోషంగా ఉంది



ఉపాధ్యాయ వృత్తిలో చేరాలన్న ఉద్దేశంతో డీఈడీ పూర్తి చేశా. తర్వాత కానిస్టేబుల్ పరీక్ష రాసి ఎంపికయ్యాను. ఇన్నాళ్లూ సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశా. డీఎస్సీ-2024లో మంచి మార్కులు సాధించి, ఎస్జీటీ ఉద్యోగం సాధించా. ఇటీవలే మద్నూర్ మండల కేంద్రంలోని రథంగల్లి పాఠశాలలో టీచర్‌గా జాయిన్ అయ్యాను. టీచర్ ఉద్యోగం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– కార్తీక్, ఎస్జీటీ, రథంగల్లి పాఠశాల

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- పత్తి ఫ్యాక్టరీ, మార్కెట్ కమిటీల తనిఖీ



సలాబత్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మద్నూర్ : పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని పత్తి ఫ్యాక్టరీలను శనివారం ఆయన పరిశీలించారు. త్వరలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మద్నూర్ మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన మార్కెట్ కమిటీ అధికారులు, పత్తి ఫ్యాక్టరీల యజమానులతో మాట్లాడారు. పత్తి విక్రయించడానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన మార్కెట్ కమిటీ సిబ్బందికి సూచించారు.

వరి ధాన్యం సేకరణకు..

వరి ధాన్యం సేకరణకు జిల్లా అంతటా ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం తనిఖీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సలాబత్‌పూర్ ప్రాంతం నుంచి తెలంగాణలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యం వచ్చే అవకాశాలున్నాయన్నారు. దీనిని అడ్డుకోవడానికి తనిఖీ కేంద్రం సిబ్బంది ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రంలోనే సోయాలు విక్రయించాలి

కొనుగోలు కేంద్రంలోనే రైతులు సోయా పంటను విక్రయించి మద్దతు ధరను పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమాలలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు నరసింహారావు, రాజేందర్, తహసీల్దార్ ముజీబ్, నాయబ్ తహసీల్దార్ ఖాలీద్, ఏవో రాజు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో ఆక్రమణల తొలగింపు



గౌరారం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రామకృష్ణ, అటవీ సిబ్బంది

గాంధారి: కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ శనివారం గౌరారం గ్రామ శివారులో ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. కబ్జాదారులు ఆక్రమించిన భూమి చుట్టూ వేసిన కంచెలు, వలలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గౌరారం గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆక్రమణకు గురైన అటవీ భూమిని స్వాధీనం చేసుకుంటామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. రెవెన్యూ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ, గాంధారి ఎఫ్ఆర్వోలు హబీబ్, హేమచందన, సిబ్బంది పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేటలో మబ్బులు కమ్ముకురావడంతో ఆరబోసిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

వణికిస్తున్న వరుణుడు

నాగిరెడ్డిపేట: వాతావరణంలో మార్పులతో రైతులకు కంటిమీద కునుకు కరువవుతోంది. వారం పదిరోజులుగా రోజూ ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. అక్కడక్కడ అడపాదడపా వర్షం కురుస్తుండడంతో ధాన్యం తడిసిపోతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబోస్తున్నారు. రోజూ ఆకాశం మేఘావృతమవుతుండడం, జల్లులు కురుస్తుండడంతో ధాన్యం తడిసిపోతోంది. ఆకాశం మబ్బులు పట్టిన ప్రతిసారి ఆరబోసిన ధాన్యాన్ని కుప్పచేస్తున్నారు. మబ్బులు తేలిపోగానే మళ్లీ ఆరబోస్తున్నారు. త్వరగా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలి

- లెక్చరర్లు నాణ్యమైన విద్య అందించాలి
- విద్యార్థులు రోజూ కళాశాలకు రావాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

దోమకొండ: లెక్చరర్లు నాణ్యమైన విద్యనందించి ఫలితాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రంలో చివరి స్థానంలో దోమకొండ కళాశాల ఉందన్నారు. విద్యార్థులు రోజూ కళాశాలకు రావాలని, లెక్చరర్స్ చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. కళాశాలలో ఏదైనా సమస్య ఉంటే ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. తమ పిల్లలు రోజూ కళాశాలకు వెళ్తున్నారా లేదా అన్న విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు కళాశాలకు రాకపోతే వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ శంకర్‌కు సూచించారు. వివిధ గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడతానన్నారు. కళాశాల వద్ద బస్సులు ఆపేలా చూస్తానన్నారు. కళాశాలలో 299 మంది విద్యార్థులు చదువుతున్నారని, రోజూ 100 నుంచి 150 మంది మాత్రమే తరగతులకు హాజరవుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఇకపై ప్రతినెలా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలు కళాశాలకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సలాం, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

కామారెడ్డి క్రైం: పాఠశాల స్థాయి నుంచే రోడ్డు ప్రమాదాల నివారణ అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం రోడ్డు భద్రత అంబాసిడర్‌లకు అవగాహన కార్యక్రమం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో రోడ్ సేఫ్టీ అంబాసిడర్స్‌ను నియమించామన్నారు. జిల్లాలోని 61 పాఠశాలల్లో 122 మంది విద్యార్థులను అంబాసిడర్‌లుగా నియమించామని పేర్కొన్నారు. అంబాసిడర్‌లు తోటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఇరుగు పొరుగు వారికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికీ నిబంధనలు తెలియజేయడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

ప్రతి వాహనదారుడు అప్రమత్తంగా వాహనాలను నడిపించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లాలో 520 గ్రామాలు ఉండగా గతేడాది దాదాపు 500 రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. నిత్యం ఏదో ఒక గ్రామంలో రోడ్డు ప్రమాద ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలకు కారకులైన వారికి నూతన చట్టం ప్రకారం 10 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని పేర్కొన్నారు. అనంతరం క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అధికారులు

ఆలయాలపై దాడులను అరికట్టాలి

- వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధుల డిమాండ్
- జిల్లాకేంద్రంలో నిరసన

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో హిందూ ఆలయాలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు ఆరోపించారు. ఆలయాలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో శనివారం జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లి రాజు, ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ వివేకానంద అశోక్‌కుమార్ మాట్లాడుతూ దేవాలయాలపై వరుసగా దాడులు చేస్తున్న ఉన్మాదులపై సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి స్పందించి దేవాలయాలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని, దాడి ఘటనలపై ప్రత్యేక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లు, వ్యక్తిత్వ వికాసం పేరిట హిందూ వ్యతిరేక భావజాలాన్ని వ్యాపింపజేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమాల్లో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధులు శ్రీకాంత్‌రావు, తులసి, వినోద్, మంచాల రాజు, వంగ ప్రసాద్, ఆకుల భరత్‌కుమార్, బండి రాములు తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల ప్రతినిధులు

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శనివారం 14,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,200, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కుల నీరు పోతోంది. వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

క్లుప్తంగా

గాంధారి పీఎస్‌లో ఓపెన్ హౌస్



గాంధారి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పీఎస్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అక్టోబర్ 21 ప్రాముఖ్యత, పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి ఉపయోగంపై వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నాగిరెడ్డిపేట: కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ఉమేశ్ సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డు వివరాలు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డ్ రాజు ఉన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు



కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు టి జ్యోతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభలకు ఆమె హాజరై మాట్లాడారు. బీజేపీ రెండుసార్లు అధికారంలో ఉండి కార్పొరేట్ సంస్థలకు వంతపాడుతోందని ఆరోపించారు. రాష్ట్రం ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే ప్రవర్తిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పాలడుగు భాస్కర్, రమ, వెంకట్‌గౌడ్, చంద్రశేఖర్, రవీందర్, నర్సింలు, మోతీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ముట్టడి



మాచారెడ్డి: బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం భారీ ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం మాచారెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎల్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, సిద్ధిరాములు, అనసూయ, వెంకటలక్ష్మి, లింగం, నాంపల్లి, గంగాధర్, శ్రీనివాస్, లక్ష్మి, రాజక్క పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని భవానీపేట్ శివారులో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- రైతు డిక్లరేషన్ అమలు చేయకుంటే భరతం పడతారు
- హైడ్రా. మూసీ ఆక్రమణల కూల్చివేతలపై ఉద్యమిస్తాం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో ఎమ్మెల్యే ధన్‌పాల్, దినేశ్, గంగారెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అన్నివర్గాలను మోసం చేసి అధికారంలోకి రావడంలో సీఎం రేవంత్‌రెడ్డి సక్సెస్ అయ్యారని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. రైతు రుణమాఫీపై సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలి సంతకం పెడతానన్న రేవంత్‌రెడ్డి మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు డిక్లరేషన్‌లో ఏం మాట్లాడారో వాటిని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో వారే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ భరతం పట్టడం ఖాయమన్నారు. సదరం క్యాంపుల్లో 40 శాతం లోపు సర్టిఫికెట్లు ఇస్తూ ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారని అన్నారు. వీరితోపాటు కొత్తగా ఒంటరి మహిళలు, వితంతు, వృద్ధాప్య పింఛన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఇస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా దిక్కులేదన్నారు. గృహలక్ష్మీ పథకంపై మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు గ్రామాల్లో అడుగు పెట్టనివ్వరని హెచ్చరించారు.

జీవో 29ను సవరించాలి..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29ని సవరించి స్పష్టత వచ్చే వరకూ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఈటల రాజేందర్ డిమాండ్‌చేశారు. అభ్యర్థుల ఆందోళనకు బీజేపీ మద్దతు ఇస్తుందని, వారిపై లాఠీచార్జి, అరెస్టులు, అక్రమ కేసులు పెట్టడం, బండి సంజయ్, ఇతర నాయకులను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తెచ్చిన దుర్మార్గమైన జీవో 29ను వాపస్ తీసుకోవాలన్నారు. మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవనం పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేయాలని చూస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి బుకాయించడం మానేసి, మూసీ ఆక్రమణలు కూల్చడం ఆపేయాలని డిమాండ్‌చేశారు. హైడ్రా, మూసీ ఆక్రమణల కూల్చివేత వంటి సమస్యలపై భవిష్యత్‌లో పెద్ద ఉద్యమం తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ అనేక మాటలు చెప్పి మోసం చేసిందని బొందపెట్టామని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో రెండు పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్తారని, మోదీ నాయకత్వంలో ఇచ్చిన మాటలకు కట్టుబడి బీజేపీ పని చేస్తుందన్నారు. ప్రజలు బీజేపీని ఆదరించి ఆశీర్వదించాలని, స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు మరింత వేగవంతం చేయాలని, అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో 50 శాతమైనా సభ్యత్వం తీసుకునేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఈటల రాజేందర్ సూచించారు. పార్టీ సభ్యత్వం, నిర్మాణం, కమిటీలు, ఐక్యత ఉన్నప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ పుప్పాల శివరాజ్, కో కన్వీనర్ సవిత, నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, గంగోనె సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి బాలుడి కిడ్నాప్

ముగ్గురు కలిసి ఎత్తుకెళ్లారు



జీజీహెచ్ నుంచి బాలుడిని ఎత్తుకెళ్తున్న ముగ్గురు మహిళలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి ఏడాది వయసున్న బాలుడిని కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.25 గంటల ప్రాంతంలో ముగ్గురు మహిళలు బాలుడిని ఎత్తుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన లక్ష్మి అనారోగ్యంతో జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చింది. భార్యతో పాటు భర్త రాజు తన కొడుకు మణికంఠతో కలిసి ఆస్పత్రిలో నిద్రించారు. అదును చూసి గుర్తు తెలియని మహిళలు మణికంఠను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం 6 గంటలకు నిద్రలేచిన రాజు తన కొడుకు పక్కన లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. స్థానిక ఒకటో టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీజీహెచ్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించగా ముగ్గురు మహిళలు కలిసి బాలుడిని ఎత్తుకెళ్లుతున్న దృశ్యాలు కనిపించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇది రెండో ఘటన

ప్రభుత్వ ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ ఇది రెండో ఘటన. కొన్ని నెలల క్రితం ఓ బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్పందించిన పోలీసు గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు.

పర్యవేక్షణ అంతంతే

ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ, సీసీఎస్ బలగాలు, పోలీసులు ఉన్నా చిన్నపిల్లల కిడ్నాప్‌లు జరుగుతూనే ఉన్నాయి. దీంతో పాటు పలువురు రోగులు సైతం ఆస్పత్రి నుంచి అదృశ్యం అవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక మరమ్మతులు



కామారెడ్డిఅర్బన్: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కోసం వినూత్న ప్రయోగంలో భాగంగా శనివారం స్థానిక సిరిసిల్లరోడ్డులోని 33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నాలుగు ఫీడర్లలో కలెక్టరేట్, ఆరేపల్లి సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేయడానికి 11 కేవీ గ్రిడ్, 400 ఎఎంపీఎస్ ఎబీ స్విచ్‌లను బిగించినట్లు జిల్లా ఎస్ఈ రమేశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని సిరిసిల్లరోడ్డు ఫీడర్‌కు జయశంకర్ కాలనీ, రామారెడ్డి ఫీడర్‌కు గుమాస్తాకాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా ఫీడర్‌కు ఆరేపల్లి ఇండస్ట్రీయల్ ఫీడర్లను అనుసంధానం చేసినట్టు వివరించారు. ఇకపై ఒక ఫీడర్‌లో సాంకేతిక సమస్యలుంటే మరో ఫీడర్ నుంచి వెనువెంటనే విద్యుత్‌సరఫరా చేస్తామని ఎస్ఈ పేర్కొన్నారు. డీఈ కె కిరణ్ చైతన్య, ఏడీఈ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి

నిజాంసాగర్(జుక్కల్): చేపలను వేటాడేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మహ్మద్‌నగర్ మండలం సింగితం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గువ్వ సాయిలు, గంగి మైశబోయి, చిట్యాల పెద్దసాయిలు ముగ్గురూ కలిసి ఇరవై రోజులుగా రాత్రి వేళల్లో చేపలను వేటాడుతున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ముగ్గురూ కలిసి సింగితం గ్రామ శివారులోని కొత్త కుంట చెరువులో చేపల వేటకు వెళ్లారు. సమీపంలోని పంట చేనుకు అడవి పందుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెను చేపలవేట కోసం తీశారు. విద్యుత్ షాక్ ఇచ్చి చేపలను వేటాడేందుకు కంచె వైరును చెరువులో వేసి దానికి సర్వీస్ వైర్ కనెక్షన్ ఇచ్చారు. చేపలను వేటాడుతున్న క్రమంలో వైరు గువ్వ సాయిలు(40)కు తగిలి చెరువులోనే చనిపోయాడు. భయాందోళనకు గురైన మైశబోయి, పెద్దసాయిలు అక్కడి నుంచి ఇంటికి జారుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నమైనా గువ్వ సాయిలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల వెతికారు. ఇదిలా ఉండగా పెద్ద సాయిలు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ పోలీసులు తెలిపా రు.మృతుడికి భార్య సుజాత,కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు ..



మనోజ్‌గౌడ్ (ఫైల్)

బీబీపేట: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ఆశిగారి మనోజ్‌గౌడ్(25) కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 14వ తేదీన పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిటీకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువు వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్ సీటీసీ ముందున్న చెరువు వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి శనివారం తెలిపారు. శనివారం సాయంత్రం జానకంపేట గ్రామానికి చెందిన మహేశ్ పోలీస్ స్టేషన్‌కి వచ్చి సీటీసీ ముందున్న చెరువులో మహిళా మృతదేహం ఉందని సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతురాలి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, పూర్తి వివరాలకు ఎడపల్లి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎడపల్లి బ్రిడ్జి వద్ద కుళ్లిన స్థితిలో మరో మృతదేహం..

ఎడపల్లి మండల కేంద్రం శివారులోని బ్రిడ్జి వద్ద కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి శనివారం తెలిపారు. బ్రిడ్జి వద్ద మృతదేహం ఉన్నట్లు గ్రామానికి చెందిన బొల్లపల్లి రాజు శనివారం మధ్యాహ్నం గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్‌కు సమాచారం అందించాడన్నారు. సెక్రెటరీ ఫిర్యాదు మేరకు ఘటనాస్థలాన్ని పరిశీలించామని, గుర్తు తెలియని వ్యక్తి సుమారు 30 రోజుల క్రితం మృతి చెంది ఉంటాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఛాతి నొప్పి భరించలేక ..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన దొడ్లె దాస్‌గౌడ్(53) అనే వ్యక్తి ఛాతినొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొడుకు, కూతురితో కలిసి హైదరాబాద్‌లో ఉంటు న్న దాస్‌గౌడ్ ఆరు సంవత్సరాలుగా ఛాతి, గుండెనొప్పితో బాధపడుతున్నారు. ఇప్పటికే రెండు స్టంట్‌లు వేశారు. అయినప్పటికీ ఛాతి నొప్పి వస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈ నెల 17వ తేదీన కుటుంబ సభ్యులకు చెప్పకుండా లింగంపేటకు వచ్చాడు.18వ తేదీన తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికు మారుడు విశాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దమ్ముతో బాధపడుతున్న వ్యక్తి..

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన నాగ్గారి చంద్రం(39) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. కొన్నేళ్లుగా గురక, దమ్ముతో బాధపడుతున్న చంద్రం ఆస్పత్రుల్లో చూయించుకున్నా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఇంటి ముందున్న జామ చెట్టుకు శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన జినగరి రాజు(46) శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. నాలుగేళ్లుగా కామారెడ్డిలో సెంట్రింగ్ పని చేస్తున్న రాజు కల్లు, జూదానికి బానిసై అప్పులపాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది లింగంపేటలోని తన కూలిపోయిన ఇంటికి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లావ ణ్య, ఇద్దరు కూతుళ్లు తనూజ, మేఘన ఉన్నారు.

కాళ్లు, కీళ్ల నొప్పులు భరించలేక వృద్ధురాలు..



రాజవ్వ మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రాజవ్వ(78) అనే వృద్ధురాలు శనివారం కుంటలోదూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై కొండల్‌రెడ్డి తెలిపారు. గతరెండు సంవత్సరాలుగా కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న రాజవ్వకు కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. అయినప్పటికీ నొప్పులు తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రాజవ్వ గ్రామశివారులోని మాలకుంటలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి నలుగురు కుమారులు ఉన్నారన్నారు. మూడో కుమారుడు బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్‌లు చోరీ

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ సంతలో శనివారం రెండు సెల్ ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. కూనేపల్లి, రెంజల్ గ్రామాలకు చెందిన ఇద్దరి ఫోన్‌లను దుండగులు కొట్టేశారు. ఆరు నెలల తరువాత మళ్లీ సంతలో చోరీలు ప్రారంభమయ్యాయని, పోలీసులు నిఘా పెట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

ధాన్యం తరుగు తీస్తే క్రిమినల్ కేసులు

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగుపేరిట రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేదిలేదని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట, ధర్మారెడ్డిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. గత ప్రభుత్వం రైతులు తరుగు పేరిట మోసం చేసిందని, తమ ప్రభుత్వం రైతులకు మేలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలో రూ.7కోట్ల50లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటి నుంచి సుమారు రూ.80లక్షల వరకు వెచ్చించి నాగిరెడ్డిపేట మండలానికి రెండు డ్రైయింగ్‌మిషన్లను కొనుగోలు చేయిస్తామని చెప్పారు. దీంతోపాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి కళాశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. కళాశాలలో లెక్చరర్ల కొరతపై జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్‌సలాంతో ఫోన్‌లో మాట్లాడారు. గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ క్లస్టర అధికారి శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఏడీఏ ఎన్ఎస్ రత్నం, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకరచారి, మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీల చైర్మన్లు నర్సింలు, గంగారెడ్డి, సీఈవోలు సందీప్, జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాయకులు రాంచందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ఇమామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: పేదరికంలో నుంచి బయటపడాలంటే విద్యకు మించిన సాధనం లేదని, మంచి శిక్షణ ఇచ్చి ప్రపంచంలో పోటీ పడే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఎల్లారెడ్డిలోని కేజీబీవీలో రూ.3కోట్ల25లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ.. బాగా చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజిత, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్‌కుమార్, కౌన్సిలర్ నీలకంఠం, నాయకులు గఫార్, విద్యాసాగర్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరిఫ్, ఎంఈవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు తెలుసుకున్న సీపీ

ఖలీల్‌వాడి: పోలీస్‌శాఖ సిబ్బంది తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర చర్యలు తీసుకుంటామని సీపీ కల్మేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి సమాజంలో పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ రిజర్వు, సీసీఎస్, సీసీఆర్‌బీ ఏసీపీలు, సీఐలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



రెడ్డిపేటలో విచారణ చేస్తున్న అధికారులు

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేటలో డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవినీతి అవకతవకలపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. శనివారం ఏపీడీ మురళీకృష్ణ, డీపీఎం రవీందర్ సురేష్ రెడ్డిపేటలో అవకతవకలపై విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా 2022 అక్టోబర్17న స్త్రీనిధి బ్యాంకుకు చెల్లించాల్సిన రూ.78,500 డబ్బులను సభ్యులు వీవోఏకు ఇచ్చారు. వాటిని వీవోఏ చెల్లించలేదు. ఈ నెల 18న వీవోఏ రూ.74,316 నగదును స్త్రీనిధి బ్యాంకుకు కట్టి మిగిలిన రూ.4184 సంబంధిత సభ్యురాలికి చెల్లిస్తానని వీవోఏ తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వీవోఏలు లక్ష్మీ నర్సవ్వ, కృష్ణవేణిని విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అలాగే ఏపీఎం ప్రసన్నకుమార్, సీసీ దుర్గాదాస్, స్త్రీనిధి సిబ్బంది నిర్లక్ష్యంపై షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసులపై ఇచ్చే వివరణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు. సోమవారం నుంచి గ్రామంలోని అన్ని గ్రూపులను ఆడిట్ చేయనున్నట్లుగా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి పేర్కొన్నారు.

ఆగని లక్కీ కాయిన్ ఆట

- ఎస్సారెస్పీ అడ్డాగా గ్యాంబ్లింగ్
- మోసపోతున్న అమాయకులు



ప్రాజెక్ట్ ఎస్కేప్ గేట్ల వద్ద లక్కీకాయిన్ ఆట

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను కేంద్రంగా చేసుకుని లక్కీ కాయిన్, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటలు జోరుగా సాగుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఎస్సారెస్పీ ఆనకట్టను కేంద్రంగా చేసుకుని కొన్ని రోజుల నుంచి దందా నడిపిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ చుట్టూ అడ్డాలు ఏర్పడ్డాయి. దీంతో సామాన్యులు మోసపోతూనే ఉన్నారు. శనివారం రోజున ప్రాజెక్ట్ ఎస్కేప్ గేట్ల వద్ద దర్జాగా లక్కీ కాయిన్ ఆటను కొనసాగించారు. ఈ ఆటలో నిమిషాల వ్యవధిలోనే అమాయకులు తమ డబ్బును పోగొట్టుకుంటున్నారు. ప్రాజెక్ట్ ఆనకట్ట, ఎస్కేప్ గేట్లు, ఆనకట్ట కింద, వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ సమీపంలో ఎక్కడపడితే అక్కడ లక్కీ కాయిన్ ఆటను ఆడిపిస్తున్నారు. కనీసం మూడు నుంచి నాలుగు గ్యాంగ్‌లు ఈ ఆటను ఆడిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్మూర్, పెర్కిట్, నిర్మల్ పట్టణాల నుంచి వస్తున్న నిర్వాహకులు ఇక్కడ అడ్డాలు పెడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి లక్కీ కాయిన్ కథను ముగించాలని పలువురు కోరుతున్నారు.

మహిళపై గ్యాంగ్‌రేప్

- ఆటోలో డిచ్‌పల్లికి తీసుకువెళ్లి అఘాయిత్యం
- నలుగురిపై కేసు నమోదు
- మెడికల్ టెస్ట్‌లకు మహిళ తరలింపు

ఖలీల్‌వాడి: ఓ మహిళపై నలుగురు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన మహిళ షాపింగ్ కోసం శుక్రవారం నిజామాబాద్‌కు వచ్చింది. అయితే రాత్రి కావడంతో నిజామాబాద్ బస్టాండ్‌కు వచ్చిన మహిళను బోధన్‌లో దించేస్తానని చెప్పి ఓ వ్యక్తి ఆటోలో ఎక్కించుకున్నాడు. ఆటోను బోధన్ వైపు కాకుండా డిచ్‌పల్లి వైపు ఆటోను తీసుకువెళ్లగా, అక్కడికి మరో ముగ్గురు చేరుకున్నారు. నలుగురు వ్యక్తులు మహిళను రేప్ చేసి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బాధితురాలు శనివారం ఉదయం నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలిని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం సదరు మహిళను మెడికల్ పరీక్షలకు పంపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు డిచ్‌పల్లికి చెందిన మోసిన్, నగేశ్, జైనొద్దీన్, సుల్తాన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బస్టాండ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి(ఎల్లారెడ్డి): చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన వడ్ల పండరి ఇటీవల తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకుని అదే గ్రామానికి చెందిన పండరి దగ్గరి బంధువులు వడ్ల రాకేశ్, వడ్ల శ్రీకాంత్ దాబా పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి రాగి, ఇత్తడి వస్తువులు ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలోని ఓ స్టీల్ దుకాణంలో శనివారం విక్రయించేందుకు రాగా, అనుమానంతో దుకాణం యజమాని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దుకాణానికి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఒకరి అదృశ్యం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన చింతల సాయిలు అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన సాయిలు తిరిగి రాలేదని, ఆయన ఆచూకీ లభించకపోవడంతో భార్య మరియమ్మ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.